# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఇండోనేషియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.
- వ్యవసాయ పారిశ్రామిక వేత్తలకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ "ప్రగతి" ప్రాజెక్టును ప్రారంభించారు.
- మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో దేశాభివృద్ధి వేగవంతమవుతుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు.
- గిరిజన పరిశోధనా సంస్థలు సంప్రదాయ విజ్ఞానాన్ని సాంకేతిక ఆవిష్కరణలతో సమన్వయం చేస్తూ.. అత్యుత్తమ పరిశోధనా కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని కేంద్రమంత్రి జువల్ ఓరం ఆకాంక్షించారు.
- కేరళంలోని వయనాడ్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

=====================

ఇండోనేషియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీంతో రెండు దేశాల అభివృద్ధితో పాటు ప్రాంతీయ, ప్రపంచ శాంతి, స్థిరత్వానికి కూడా బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. ఇండోనేషియా రాజధాని జకార్తాలోని పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి.. భారత్–ఇండోనేషియా సంబంధాలు శతాబ్దాల చరిత్ర కలిగినవని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి, శాంతి, స్థిరత్వం, సుసంపన్నతను విశ్వసిస్తుందని చెప్పారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని, ప్రాంతీయ భద్రతకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను నిరోధించాలని ఉద్ఘాటించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంతో పాటు గ్లోబల్ సౌత్ స్థిరత్వానికి కూడా భారత్ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రక్షణ,

సముద్ర భద్రత, వాణిజ్యం, డిజిటల్ టెక్నాలజీ, విద్య, కృత్రిమ మేధ (ఏఐ) తదితర రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ప్రధాని సూచించారు. అలాగే యూపీఐ ఆధారిత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కృత్రిమ మేధ, విద్య, స్టార్టప్‌లు, ఆవిష్కరణ రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా ఇరు దేశాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో "ప్రగతి" ప్రాజెక్టును కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా 20 వేల మందికి పైగా వ్యవసాయ పారిశ్రామికవేత్తలూ, సుమారు 20 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడిన శివరాజ్ సింగ్ చౌహాన్.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అభివృద్ధి చెందిన వ్యవసాయం, సుసంపన్న గ్రామాలు, ఆర్థికంగా బలమైన రైతులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ప్రభుత్వ ప్రయత్నాలకు ఇతర సంస్థలు కూడా తోడైతే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్నారు. "ప్రగతి" కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 26 వేల మంది చిన్న స్థాయి వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలియజేశారు. గ్రామ స్థాయిలో పనిచేసే ఈ పారిశ్రామికవేత్తలు ఒక్కొక్కరూ 100 నుంచి 200 మంది రైతులతో కలిసి పనిచేస్తూ.. గ్రామ వ్యవసాయ రంగంలో సాంకేతికత, ఆధునిక పద్ధతులను ప్రోత్సహించి వ్యవసాయాభివృద్ధికి దోహదపడతారని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో దేశాభివృద్ధి వేగవంతమవుతుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన "వికసిత్ భారత్ కాన్‌క్లేవ్"లో ప్రసంగించిన ఆయన.. 14 కిలోమీటర్ల పొడవైన జోజిలా సొరంగ మార్గం, జమ్మూ–శ్రీనగర్ కారిడార్‌లో నిర్మిస్తున్న 36 సొరంగాలు, కేదార్‌నాథ్ రోప్‌వే ప్రాజెక్టు, అలాగే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మెరుగైన రహదారి అనుసంధానం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు దేశంలో రవాణా సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరుస్తున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ఆధారిత వృద్ధిపైనే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. సుపరిపాలన అనేది దేశ నిర్మాణాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని సాగాలని, రాజకీయాలు సామాజిక–ఆర్థిక పరివర్తనకు సాధనంగా మారాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

గిరిజన వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు.. సమ్మిళిత అభివృద్ధిని సాధించాలంటే సంప్రదాయ గిరిజన విజ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించాల్సిన అవసరం ఉందని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరం అన్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో రెండు రోజుల జాతీయ సదస్సును కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజన పరిశోధనా సంస్థలు సంప్రదాయ విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలతో సమన్వయం చేస్తూ అత్యుత్తమ పరిశోధనా కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గిరిజన భాషలు, సంస్కృతీ, సాంప్రదాయ జ్ఞానాన్ని పరిరక్షిస్తూనే.. డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి పరిశోధన, డాక్యుమెంటేషన్, విధాన రూపకల్పనను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జాతీయ సదస్సులో దేశ వ్యాప్తంగా విధాన నిర్ణేతలు,

పరిశోధకులు, విద్యా వేత్తలు, సాంకేతిక నిపుణులు పాల్గొంటున్నారు. గిరిజన పరిశోధనా సంస్థలను జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో మంత్రిత్వ శాఖ ఒక నూతన కార్యాచరణను కూడా ఈ సందర్భంగా ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

డ్యూరాండ్ కప్–2026 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన ట్రోఫీలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఆవిష్కరించారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో ఉన్న సాంస్కృతిక కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్యూరాండ్ కప్ ట్రోఫీని అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... ఈ ఏడాది డ్యూరాండ్ కప్, ప్రెసిడెంట్స్ కప్, షిమ్లా ట్రోఫీలను కైవసం చేసుకునేందుకు కొత్త జట్లు పోటీపడనున్నాయని తెలిపారు. కొత్త జట్ల భాగస్వామ్యంతో ఈ చారిత్రక టోర్నమెంట్ మరింత ఉత్కంఠభరితంగా, ప్రజాదరణ పొందుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది టోర్నమెంట్‌లో శ్రీలంక జట్టు పాల్గొనడం పట్ల రాష్ట్రపతి హర్షం వ్యక్తం వెలిబుచ్చారు. కొత్త జట్ల చేరికతో ఈ చారిత్రక పోటీకి అంతర్జాతీయ గుర్తింపు, ఆదరణ మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న అన్ని జట్లు, క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలియజేస్తూ... క్రీడాస్ఫూర్తితో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో నైరుతి రుతుపవనాలు మరో మూడు రోజుల్లో మరింత విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఉత్తర అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, గుజరాత్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల మిగిలిన ప్రాంతాలు, అలాగే రాజస్థాన్‌లోని మరిన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని పేర్కొంది. ఈరోజు తీరప్రాంత కర్ణాటక, గుజరాత్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ శాస్త్రవేత్త డి. ధర్మరాజు వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

కేరళంలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. ఆరుగురు గల్లంతయ్యారు. వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద సొరంగ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఈ రోజు భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. ప్రమాదం సంభవించిన సమయంలో భూగర్భంలో చిక్కుకుపోయిన 9 మంది కార్మికులను సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసి.. మెప్పాడిలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించాయి. మరో ఆరుగురు కార్మికుల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని, వారు శిథిలాల కింద చిక్కుకుపోయి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అగ్నిమాపక, రక్షణ శాఖ సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు సంఘటన స్థలంలో సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాల విస్తరణ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు గుజరాత్‌లో పలు ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా సౌరాష్ట్ర, దక్షిణ గుజరాత్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో వల్సాద్ జిల్లా వాపిలో అత్యధికంగా 216 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలో సాధారణ జనజీవనం స్తంభించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా 700 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గుజరాత్ రాష్ట్ర వ్యాప్తంగా 80 ప్రాంతీయ రహదారులను తాత్కాలికంగా మూసివేయగా.. అనేక గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =